సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

7

ఆదివారం | 30 | మార్చి | 2025



కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం
కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఏప్రిల్ 2 నుంచి పాదయాత్రలు చేస్తున్నట్లు పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తెలిపారు.
- 10లో▸



కేయూ బడ్జెట్ రూ.428.82 కోట్లు
కాకతీయ యూనివర్సిటీ 2025-26వ ఆర్థిక సంవత్సరానికి రూ.428.82 కోట్ల అంచనాతో శనివారం బడ్జెట్ ప్రవేశపెట్టారు.
- 10లో▸

గరిష్టం/కనిష్టం
$39^0/24^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఉంటుంది. మధ్యాహ్నం వేళ వేడితోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

ఉగాది కొనుగోళ్లు



పండుగ నేపథ్యంలో శనివారం నగరవాసులు ఉగాది పచ్చడికి అవసరమైన కొత్త మట్టి కుండలు, మామిడికాయలు, ఆకు, వేప పువ్వు తదితర సామగ్రి కొనుగోలు చేశారు. దీంతో హనుమకొండ, వరంగల్ చౌరస్తాలు, ముఖ్య కూడళ్లు జనంతో రద్దీగా మారాయి.

న్యూస్‌రీల్

సనాతన ధర్మానికి ప్రతీక పంచాంగం




హన్మకొండ చౌరస్తా: భారతీయ హిందూ సనాతన ధర్మానికి ప్రతీక పంచాంగమని ప్రముఖ వైద్యుడు డాక్టర్ గజ్జెల భరత్, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ అన్నారు. హనుమకొండ కుమార్‌పల్లిలోని సన్‌షైన్ కన్వెన్షన్ హాల్‌నందు శనివారం శ్రీవిశ్వకర్మ విజ్ఞాన శ్రీలలితా పంచరత్న పంచాంగం, జ్ఞానగౌరి సూర్య సిద్ధాంత ప్రామాణిక చాంద్రమాన పంచాంగం పుస్తకాలను ఆవిష్కరించారు. వరంగల్ ఉమ్మడి జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (వోపా) రామోజు నాగరాజారావు అధ్యక్షతన జరిగిన ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ గజ్జెల రాజభరత్, గంగు ఉపేంద్రశర్మ పాల్గొన్నారు. ఈసందర్భంగా పంచాంగ నిపుణులు బేతోజు సత్యనారాయణ, కట్టా వెంకట మధుసూదనాచార్యులతో పాటు వివిధ రంగాల్లో రాణిస్తున్న విశ్వబ్రాహ్మణ ప్రముఖులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కొక్కొండ విజయ్‌బాబు, ఏసీపీ బొంపెల్లి తిరుపతిరావు, తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, ఆకునూరి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ రోజు రిజిస్ట్రేషన్లు

కాజీపేట అర్బన్: ఈనెల 31న సోమవారం రంజాన్ పండుగ రోజున కూడా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పని చేస్తాయని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ ఫణీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్-20లో భాగంగా 25 శాతం రాయితీ ఈనెల 31తో ముగియనుంది. దీంతో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఐజీ ఆదేశాల మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు బ్యాంకులు పని చేయనున్నట్లు తెలిపారు. భూక్రయవిక్రయదారులు ఎల్ఆర్ఎస్-20లో భాగంగా 25 శాతం రాయితీని వినియోగించుకోవాలని కోరారు.

9న సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర

ఖిలా వరంగల్: ఏప్రిల్ 9న భారత్ గౌరవ్ (టూరిస్ట్) ట్రైన్ ద్వారా కాజీపేట నుంచి సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర ప్రారంభమవుతుందని, ఉమ్మడి జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఐఆర్‌సీటీసీ మార్కెటింగ్ ఇన్‌చార్జ్ ఓడ్సు నరేశ్‌బాబు, టూరిజం మానిటర్ కొప్పుల ప్రశాంత్ పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో వారు ఐఆర్‌సీటీసీ రూపొందించిన సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో భారత్ గౌరవ్ ప్రత్యేక టూరిజం రైలులో ఏప్రిల్ 9 నుంచి 19 వరకు కొనసాగనున్న సప్త (ఏడు) జ్యోతిర్లింగ దర్శన యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 97013 60701, 92810 30711, 92810 30712 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.




షడ్రుచుల జీవితం

ఉగాదికి కొత్తదారిలో అడుగులేద్దాం..

- జీవనయానంలో ఎన్నో ఒడిదొడుకులు..
- జీవితపరమార్థం తెలిపే ఆరు రుచులు
- శ్రీవిశ్వావసు తెలుగు సంవత్సరాదికి స్వాగతం

జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను సమానంగా స్వీకరించి సంతోషంగా ముందుకు సాగాలని తెలియజేసేదే ఉగాది పచ్చడి పరమార్థం. షడ్రుచులంటే తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు. అలాగే సంతోషం, విచారం, ఐశ్వర్యం, పేదరికం, విజయం, పరాజయం ఆరు రుచుల మిశ్రమమే జీవితం. ఈ ఏడాది షడ్రుచుల సమ్మేళనంతో అందరి జీవితాలు సాగిపోవాలని ఆకాంక్షిస్తూ శ్రీవిశ్వావసు తెలుగు సంవత్సరాదికి స్వాగతం పలుకుదాం..

- హన్మకొండ కల్చరల్



ఆనందం.. సంతోషం..

ఆనందం, సంతోషం తీపికి గుర్తులు. తల్లిదండ్రులు తమ పిల్లలతో సంతోషంగా జీవితాన్ని ఆస్వాదించాలి. మాటే మంత్రంగా ఎదుటివారి నొప్పించకుండా మాట్లాడే తీరును అలవర్చుకోవాలి. పిల్లలకు నేర్పాలి. ప్రేమ, ఆప్యాయతలతో ఉండే పలకరింపుతోనే ఎదుటివారు మన మాటలు వినడానికి ఆసక్తి చూపుతారు. దానికి ఉదాహరణ స్వామి వివేకానందుడి చికాగో ప్రసంగం. పలువురి ప్రజాప్రతినిధుల ప్రసంగాలు స్ఫూర్తి నిస్తాయి. కుటుంబంలో తోడబుట్టిన వారు ఒకరికొకరు కష్టసుఖాలను పంచుకుంటూ సంతోషంగా గడపాలి. పిల్లలను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచుతూ.. బంధువులతో, స్నేహితులతో పండుగ పనుల్లో భాగస్వాములను చేయడం, సంప్రదాయాలను పాటించేలా ఆధ్యాత్మిక, నైతికవిలువలు నేర్పాలి. అది ఈ ఉగాదినుంచే మొదలుపెడదాం.

విచారానికి విరుగుడు

ఇంట్లో, బయట ఉండే సమస్యల కారణంగా ఆరోగ్యంతోపాటు అందం, ఆనందం దూరమవుతాయి. సమస్యలను అధిగమించాలే కానీ విచారంతో జీవనాన్ని కొనసాగించవద్దు. వగరులాంటి విచారానికి విరుగుడుగా వాకింగ్ సంగీతం వినడం, మెడిటేషన్, యోగా వంటివి సాధన చేయాలి. ఇంట్లో బాధపడుతూ కూర్చోకుండా పనుల్లో నిమగ్నమవ్వాలి. ఇదే విషయాన్ని చిన్నప్పటి నుంచి పిల్లలకు నేర్పాలి. మానసిక వికాసానికి క్రీడలు, వ్యాయామం ఎంత అవసరమో చెప్పాలి. వారికి ఇష్టమైన రంగంలో ప్రోత్సహించాలి. ఇందుకు ఉగాదిపండుగ రోజున నిర్ణయం తీసుకుందాం.

పట్టుదలతో ఐశ్వర్యం

చదువుల విషయంలో పిల్లలు అత్యుత్తమ ఫలితాలు పొందేలా విజేతలుగా నిలిచేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. పిల్లలు తల్లిదండ్రుల మీద ఆధారపడకుండా వారికి భారం తగ్గించేలా పార్ట్‌టైం జాబ్‌లు చేసి డబ్బు సంపాదించడం అలవర్చుకోవాలి. నగరంలో కాకతీయ మెడికల్ కాలేజీ దగ్గర కొందరు బీటెక్ విద్యార్థులు సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు మొబైల్ టిఫిన్ సెంటర్‌ను నడుపుతూ వారి తల్లిదండ్రులకు ఆసరాగా నిలుస్తున్నారు.. కొత్త కొలువులు సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలి. ఆ కుటుంబం ఆర్థికంగా ఉన్నతంగా నిలుస్తుంది. యువకులు ఈ దిశగా పండుగరోజు తొలిఅడుగు వేయాలని ఆశిద్దాం.

కష్టపడేతత్వం

జీవితంలో స్థిరపడాలంటే చిన్నతనంనుంచే కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి. ఉన్నత చదువులు చదివినా సరైన ఉద్యోగం లేక పేదరికంతో బాధపడుతున్నారు. నగరానికి చెందిన ప్రవీణ్ పీజీ చేశాడు. ఓ కాలేజీలో పార్ట్‌టైం ఉద్యోగిగా పనిచేస్తూనే వరంగల్ చౌరస్తాలో వారి పొలంలో పండిన కూరగాయలను అమ్ముతూ తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటున్నాడు. ఉద్యోగం దొరక్కపోతే.. జీవితం అంధ'కార'ం అవుతుందనుకోవడం పొరపాటు. ఈ విశాల విశ్వంలో సంపాదించడానికి మార్గాలెన్నో ఉన్నాయి. ఏదో ఒక పనిచేసి, సంపాదిస్తే పేదరికాన్ని పారదోలవచ్చు. ఇందుకు ఏం చేయాలన్నదానిపై పండుగ రోజు నిర్ణయం తీసుకుందాం.

నేర్చుకుంటేనే విజయం..

విద్యార్థులు పోటీపరీక్షల్లో విజయసాధించాలంటే ఎంతో సాధన అవసరం. అందుకు దినపత్రికలు, కొంతమేర సెల్‌ఫోన్ ఉపయోగపడుతాయి. ఇటీవల ఉమ్మడి జిల్లానుంచి అనేకమంది గ్రూప్-1, 2లో ఉద్యోగాలు సాధించారు. గ్రూప్-1లో శాయంపేట మండలం తహరాపూర్‌కు చెందిన తేజస్వినీరెడ్డి రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ముల్కలపల్లికి చెందిన మేకల ఉపేందర్ రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించాడు. 'ఏకాగ్రతతో చదువుతూ విజయం సాధించాలి.'అని సదరు ర్యాంకర్లు చెబుతున్న మాట. వ్యాపారాల్లోనూ సమయాన్ని వృథా చేయకుండా సరైన ఆలోచనలు చేస్తూ కొనసాగించాలి అప్పుడే లాభాలు గడిస్తూ విజయాన్ని సాధించవచ్చు.

అపజయమే విజయానికి మెట్టు..

జీవితంలో అపజయం కలిగినప్పుడు బాధపడకుండా విజయాన్ని అందుకోవడానికి సోపానం తయారుచేసుకోవాలి. వ్యాపారంలో నష్టం కలిగినా, విద్యార్థులు పరీక్షల్లో పాస్ అవ్వకపోయినా, పోటీపరీక్షల్లో ఉద్యోగం సాధించకపోయిన డిప్రెషన్‌కు గురికాకుండా అపజయానికి కారణం వెతకాలి. మరో ప్రయత్నంగా పట్టుదలతో కృషిచేస్తే విజయాన్ని సాధించవచ్చు. ఇప్పుడు గొప్పస్థానాల్లో ఉన్నవారంతా ఏదో ఒక తరగతిలో ఫెయిలై ఉండొచ్చు. అలా అని వారి లక్ష్యసాధనకు వెనుకడుగు వేయలేదు. ఓటమితో రెట్టింపు ఉత్సాహాన్ని తెచ్చుకుని ముందుకు సాగారు.

ఉగాది పచ్చడి తయారు చేస్తున్న యువతులు



దుఃఖానికి కుంగిపోవద్దు..



ఉగాది పర్వదినం సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి, సుఖాలకు పొంగిపోకుండా, దుఃఖానికి కుంగిపోకుండా సమానంగా స్వీకరించాలి. చిన్నచిన్న కారణాలతో ప్రాణం తీసుకోవద్దు. ఆయురారోగ్యాలతో ఉండాలి. ఓటమి రేపటి గెలుపునకు నాంది. ఉగాది పచ్చడి స్వీకరించి ఆరోగ్యమైన జీవితాన్ని అందుకోవాలి.

- బండా ప్రకాశ్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్

యువత సన్మార్గంలో నడవాలి..



ఈ ఉగాది నుంచి యువత చెడు మార్గాలను వదిలేసి సన్మార్గంలో ప్రయాణించాలి క్రమశిక్షణతో ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగితే బంగారు భవిష్యత్‌ను అందుకుంటారు. నూతన తెలుగు సంవత్సరంనుంచి నగరప్రజలు శాంతియుతమైన జీవనం గడపాలి.

- ఇంజారపు పూజ, (ఎస్పీ) పీటీసీ ప్రిన్సిపాల్

కొత్త జీవితాన్ని ప్రారంభించాలి..



వసంత రుతువుతో మొదలైన ఈ పండుగ వేళ కొత్తజీవితాన్ని అందుకోవాలి. ఆత్మీయ అనుబంధాన్ని గుర్తుచేస్తూ.. కష్టసుఖాల జీవితంలో షడ్రుచులను చూడడమే ఉగాది. చిన్నతనంనుంచి పచ్చడిలో ఔషధగుణాలు ఉంటాయని భావించి స్వీకరించేవాళ్లం. ఇంటిల్లిపాది పండుగను ఆనందంగా జరుపుకోవాలి.

- ప్రావీణ్య, సత్యశారద, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు

తొలి వెలుగు



ప్రకృతిలోని పచ్చదనం
ప్రజల జీవితాల్లోకి ప్రసరించాలి..
పక్షుల్లోని సంగీతం
జనుల హృదయాల్లో ప్రతిధ్వనించాలి
పువ్వుల్లోని సుగంధం
జనాల మనసుల్లో పరిమళించాలి..
వసంతంలోని నూతనత్వం
ప్రపంచమంతటా వెల్లివిరియాలి
ప్రతీరోజు ఉగాది కావాలి..

- ఐతా శ్రీనివాస్, హనుమకొండ

మరిన్ని కవితలు : 8,9లో

తెలుగుదనం ఉట్టిపడేలా!

పంచెకట్టు..లాల్చీతో వెంకట కమలాకర్



గీసుకొండ: తెలుగుదనం ఉట్టిపడేలా పంచెకట్టు, లాల్చీతో సంప్రదాయానికి బ్రాండ్‌గా నిలుస్తున్నారు గీసుకొండ ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ ఆసూరిమరింగంటి వెంకట కమలాకర్. అధికారుల సమీక్షలు ఉన్నా, మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశాల్లోనైనా ఆయన డ్రెస్‌కోడ్ భిన్నంగా ఉంటుంది. నిలువుబొట్టు, పంచెకట్టు, లాల్చీతోపాటు పిలకజుట్టుతో ప్రత్యేకంగా ఉంటారు. బ్రాహ్మణీయ వైష్ణవ కుటుంబంలో పుట్టిన ఆయన కృష్ణతత్వం వైపు ఆకర్షితులై తన జీవన విధానాన్ని మలుచుకున్నారు. ఎవరితోనైనా సౌమ్యంగా మాట్లాడడం ఆయన తీరు. పాఠశాల, కళాశాలలో చదువుకునేటప్పుడు ప్యాంట్, షర్టు వేసుకున్నా.. 1994లో జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగం వచ్చినప్పటి నుంచి ఆయన డ్రెస్‌కోడ్ పూర్తిగా మారిపోయింది. నేటి ఆధునిక ప్రపంచంలో ఇలా కనిపించడం అరుదు.

వేయిస్తంభాల ఆలయంలో ఉగాది ఉత్సవాలు

- పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం
- నేటి నుంచి రామనవమి ఉత్సవాలు షురూ



హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో ఉగాది సందర్భంగా ఆదివారం పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. శ్రీరామ నవమి నవరాత్రి ఉత్సవాలు సైతం ప్రారంభం కానున్నాయి. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు శనివారం దేవాలయంలో శ్రీసీతారాములను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు, భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేయనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. సాయంత్రం ఐనవోలు రాధాకృష్ణ సిద్ధాంతిచే పంచాంగశ్రవణం, కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు దేవాలయ ఈఓ అనిల్‌కుమార్ తెలిపారు.

ఉగాదితో జాతర ముగింపు..



ఐనవోలు: సంక్రాంతి రోజు మకర సంక్రమనం దిష్టి కుంభం కార్యక్రమంతో ప్రారంభమైన ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు నేటి (ఉగాది)తో ముగియనున్నాయి. పూర్వం ఉన్న పరిస్థితుల దృష్ట్యా ఈ సమయం అనువైనదిగా భావించి భక్తులు మల్లన్నకు మొక్కులు చెల్లించేవారు. ఉగాది రోజు ఆలయంలో ఉదయం మల్లన్నకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి నూతన వస్త్రాలు అలంకరిస్తారు. ఉగాది పచ్చడిని నైవేద్యంగా సమర్పించి భక్తులకు అందిస్తారు. సాయంత్రం పంచాంగ శ్రవణం చేయడంతో 3 నెలలు సాగిన జాతర ముగిసినట్లు ప్రకటిస్తారు.

మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం

- మంత్రి కొండా సురేఖ
- ముస్లింలకు ఇఫ్తార్ విందు



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్: మైనార్టీల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వరంగల్ ఎల్‌బీనగర్‌లోని ఏ-1 ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో మంత్రి సురేఖతో పాటు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూపాషా తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలకు పండ్లు తినిపించి ఉపవాస దీక్షలను విరమింపజేశారు. ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముస్లింలను అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఫుర్‌ఖాన్, కావేటి కవిత, సునీల్‌కుమార్‌జోషి, పోశాల పద్మ, మరిపల్ల రవి, చింతాకుల అనిల్, నాయకులు అయూబ్ ఖాన్, మీసాల ప్రకాశ్, దాసరి రాజేశ్, కూచన రవీందర్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రమేశ్, డీపీఆర్ఓ అయూబ్‌అలీ ముస్లిం మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయం

- ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



టీఎన్జీఓస్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని

హన్మకొండ చౌరస్తా : నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. 10వ డివిజన్ పరిధిలోని మచిలీబజార్, నబీఖాన ప్రాంతాల్లో రూ.75 లక్షలతో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయినేజీ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు తోట వెంకటేశ్వర్లు, వేముల శ్రీనివాస్, ఎస్.కుమార్‌యాదవ్, నజీమ్‌జిహాన్, వేయిస్తంభాల గుడి అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

47వ డివిజన్‌లో..

కాజీపేట రూరల్ : కాజీపేట 47వ డివిజన్ ఇంపీరియల్ కాలనీలో శనివారం రూ.13 లక్షలతో సీసీరోడ్డు, పోచమ్మగుడి, రూ.3 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీరజాలి, షేక్ అజ్జర్ తదితరులున్నారు.

టీఎన్జీఓస్ భవన్‌లో ఇఫ్తార్ విందు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ టీఎన్జీఓస్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, అజీజ్‌ఖాన్, ఈవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ సాంకేతిక సమస్యలు పరిష్కరించండి

మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: ఎల్ఆర్ఎస్‌ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, సాంకేతిక సమస్యల్ని యుద్ధప్రతిపాదికన పరిష్కారించాలని మేయర్ గుండు సుధారాణి టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈనెల 30, 31 తేదీల్లో సెలవులు ఉన్నప్పటికీ బల్దియా పరిధిలో ఏర్పాటు చేసిన 10 ఎల్ ఆర్ ఎస్ హెల్ప్ డెస్క్ లు పనిచేస్తాయని, అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉండాలన్నారు. ఎల్ఆర్ఎస్ 25 శాతం రిబేట్ ఈనెలాఖరుతో ముగుస్తుందని.. అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్, ఏసీపీలు రజిత, ఏర్షాద్, శ్రీనివాస్ రెడ్డి, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టెన్త్ పరీక్షలు

విద్యారణ్యపురి: టెన్త్ పరీక్షలు కొనసాగుతున్నాయి. హనుమకొండ జిల్లాలో 67 పరీక్ష కేంద్రాల్లో శనివారం నిర్వహించిన బయాలాజికల్ సైన్స్ పరీక్షలో 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 12,043 మంది విద్యార్థులకుగాను 12,035 మంది విద్యార్థులు హాజరుకాగా 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ వాసంతి తెలిపారు.

అభ్యంతరాలను 2వ తేదీలోగా తెలపాలి

ఎంజీఎం : హనుమకొండ జిల్లా వైద్యారోగ్యశాఖలో ఖాళీగా ఉన్న 13 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు మెరిట్ జాబితాను ప్రదర్శించినట్లు డీఎంహెచ్‌ఓ అప్పయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెరిట్ జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే వరుసగా పండుగ సెలవులు ఉండడంతో 2వ తేదీ వరకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

యూడీఐడీ కార్డులతో ప్రయోజనాలు

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద



మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

వరంగల్: దివ్యాంగుల గుర్తింపు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జారీ చేస్తున్న యూనిక్ డిజేబిలిటీ ఐడెంటిటీ (యూడీఐడీ) కార్డులతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చని కలెక్టర్ డాక్టర్ సత్యశారద పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో యూడీఐడీ కార్డులపై సంబంధితశాఖ అధికారులు, సిబ్బంది, దివ్యాంగులకు డీఆర్డీఓ కౌసల్యాదేవి అధ్యక్షతన శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈకార్డులు ఉన్న వారికి మాత్రమే కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని ఆమె తెలిపారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీపీఓ కల్పన, డీఎంహెచ్ఓ సాంబశివరావు, ఎంజీఎం, ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్లు కిశోర్, భరత్‌కుమార్, నర్సంపేట వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ దాస్ పాల్గొన్నారు.

సలహాలు, సూచనలివ్వాలి..

బేటీ బచావో-బేటీ పడావో 2025-26 యాక్షన్ ప్లాన్‌లో సలహాలు, సూచనలు అందించాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జిల్లా సంక్షేమ అధికారి రాజమణి అధ్యక్షతన శనివారం జరిగిన సమీక్షలో వార్షిక ప్రణాళిక వివరాలను లైన్ డిపార్ట్‌మెంట్, కమిటీ సభ్యులకు వివరించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్, రజిని, రేణుక పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

వరంగల్: ప్రత్యేక దృష్టిసారించి దివ్యాంగులు, వయోవృద్ధుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణిలో ఆమె వినతులను స్వీకరించారు. డీఆర్‌డీఓ నాలుగు, డీడబ్ల్యూఓ రెండు, జెడ్పీ సీఈఓకు 3 విజ్ఞప్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు.

నేడు, రేపు మీ సేవ, సిటిజన్ సర్వీస్‌లు తెరిచి ఉంటాయి

- వన్ టైం సెటిల్‌మెంట్ స్కీం వినియోగించుకోవాలి
- గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే



వరంగల్ అర్బన్: వన్ టైం సెటిల్మెంట్ గడువు ఈనెల 31తో ముగుస్తోందని, నగరవాసులు వినియోగించుకోవాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాకడే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటీఎస్ గడువు ముగుస్తున్నందున ఈనెల 30, 31 తేదీలు సెలవు రోజులున్నాయని, అయినప్పటికీ సిటిజన్ సర్వీస్ సెంటర్లు, మీ సేవ కేంద్రాలు తెరిచి ఉంటాయని పేర్కొన్నారు. అంతేకాకుండా బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. మై జీడబ్ల్యూఎంసీ మొబైల్ యాప్ ద్వారా కూడా చెల్లింపులకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అధిక మొత్తంలో బకాయి ఉన్న వారు ఈఅవకాశాన్ని వినియోగించుకుని 2024-25 వరకు ఉన్న పాత బకాయిలు, బకాయిలపై 10 శాతం వడ్డీ చెల్లించి 90 శాతం వడ్డీ మినహాయింపు పొందాలని కోరారు. hhttps://gwmc.gov.\in, cdmataxenquriy. aspx ద్వారా పన్నులు చెల్లించాలని కమిషనర్ కోరారు.

కవితల వెల్లువ



కొత్త వత్సరానికి స్వాగతం పలుకుతూ.. కవులు కవితలు రాశారు. వసంతాన్ని వర్ణిస్తూ ఒకరు.. షడ్రుచులను వివరిస్తూ మరొకరు.. జీవిత సారాన్ని తెలుపుతూ ఇంకొకరు.. పండుగ పరమార్థాన్ని చెబుతూ మరొకరు.. ఇలా ఒక్కొక్కరూ ఒక్కోలా స్పందించారు. 'సాక్షి' ఉగాది కవితలకు స్వాగతం శీర్షికకు ఉమ్మడి వరంగల్ జిల్లా కవులు, కవయిత్రుల నుంచి అనూహ్య స్పందన లభించింది. వెల్లువలా వచ్చిన కవితల్లో మేలిమి కొన్నింటిని ఇక్కడ ప్రచురిస్తున్నాం..

వసంతాగమనం



ప్రకృతి శిశిరాన్ని వదిలించుకుని..
నెమ్మదిగా పచ్చగా పరుచుకుని
మల్లెల పరిమళాలతో మేలుకుంటుంది..
వేప పూత వెన్నెలలా విచ్చుకుంటుంది.
షడ్రుచుల కలబోత జీవిత గమనాలన్నీ రుచి చూపిస్తుంది..
రాగాల కలబోతతో కోకిల గంధర్వ రాగాన్ని పలికిస్తుంది
అప్పుడే నిస్తేజమైన మనః శరీరాలు
చిత్ర(చైత్ర) మైన కదలిక తో ఉత్తేజమవుతాయి.
ఏడాదికో పేరుతో వచ్చినా
ఎప్పటికప్పుడు నవ వసంతాగమనమే
ఈ ఏడాదికి..
విశ్వవసు ఉగాది నవ పర్వపు ఆనందమే.

- శిరీష శ్రీభాష్యం, హనుమకొండ

ఆరు రుచుల సమాహారం



తెలుగు వారి తొలి రోజుగా...
జీవిత పాఠం తెలిపే నిండుగా..
ఆరురుచుల సమాహారంగా..
ఆనందంగా గడిపే గొప్ప పండుగ..
భవిష్యవాణి ప్రారంభమవగా..
కొత్త ఆశలతో మనసు పొంగగా..
ఉత్సాహం నింపెను 'ఉగాది'..
ఉరుకులతో సాగుదాం ఈ ఏడాది..

- పండుగ కళ్యాణి, ఇస్సిపేట, భూపాలపల్లి

వసంత కాంత



కలువపూకన్నులతో వెన్నెలవాన కురిపిస్తూ..
రెళ్ల పూల నవ్వుల జల్లులు ముంగిళ్లలో మురియ..
బంతిపూ కాళ్లకు గోరంటపారాణి అమర...
పచ్చనివాకిళ్లలో వేపపూజల్లుల
వెండి ముగ్గుల శోభలతో....
చిరు చిగుర్ల మావిడి తోరణాల
కమ్మని వాసనలతో..
కోయిలమ్మ తీయని రాగాలతో స్వాగతం పలక....
ఘల్లు ఘల్లున అందెల రవళులు మ్రోగ...
దోసిళ్ల ముత్యాల పంటతో శుభాలనొసంగ....
బంగరు నవ్వులు కురిపిస్తూ నట్టింట అరుదెంచె
విశ్వావసు వసంత కాంత.

- వకుల వాసు, చెన్నూరు, జనగామ

సృష్టి ఆరంభం



సృష్టికి ఆరంభం..
రుతువుల ప్రారంభం
భవిష్య పంచాంగం..
షడ్రుచుల సేవనం
బచ్చప్పాల తీపిదనం.. దేహపుష్టికి ఆహారం..
కొత్తసాలు వ్యవహారం.. కోటి ఆశల స్వాగతం
చైత్ర మాసపు పవనం..
చైతన్యమై లక్ష్యంతో ప్రయాణం
శిశిరాన శిథిలమై రాలిన పత్రం..
చిగురించి చెట్లు గెలిచి చూపే విజయం..

- మంగళంపల్లి చిరంజీవి, చిట్యాల

గెలిచిన రుతువు..



అమ్మ పాటలా మట్టి పరిమళ
నిరంతరం ప్రవాహం...
చిగురు తోటలో కుసుమాల
హృదయాలపై సీతాకోకల బృందగానం
కాలానికి పక్షి పాటకు విడదీయరాని
అనుబంధ మధురిమల మమతానురాగం
పువ్వుల నదిలో సుగంధం చిందే
ఆత్మీయానుబంధాల నీరాజనం.
చిగురు వెలుగుల వెనక చినుకు స్పర్శల
చిటపట పలకరింపు...
గెలిచిన ఋతువుల గాలి ఊయలల
నూతన దృశ్యాల పులకరింపు
ఈ ఉగాది మనకందించే వినూత్న సందేశం..
విశ్వావసు వేళ విజయమే సదా
ఎందుకిక సందేహం..

- అనురాధ మేరుగు, అక్కంపేట

కొత్త సాలు..



మావిళ్ల కొత్త చీరలు కట్టి
వేప పువ్వు వెండి రవికలు
తొడిగిన వసంత కోయిల
తెలుగు ముంగిట ఉగాది
కచేరీ చేయడానికి వచ్చేస్తుండగా..
కొత్త సాలు సంబురాన్ని తొడుక్కున్న
తెలుగింటి గడపల్ని ఆరు రుచుల
అనుబంధాలను జయించడానికై
పంచాంగ శ్రవణ పాటలను వింటుంటాయి.

- గట్టు రాధిక మోహన్, హనుమకొండ

రావమ్మా.. విశ్వావసు



జగతిన జరిగే జగడాలన్ని
అలతిగ సర్దుమణిగేలా
సస్యశ్యామల భారతావనిలో
సమస్త ప్రాణులు బతికేలా
ఋతువులన్నీ సక్రమంగా వచ్చి
ప్రకృతి పులకించేలా సౌభాగ్యాల భారతావని
కీర్తి అవధులు దాటేలా వసుధైక కుంటుంబం
మాదని చాటుతూ
పరిపాలన ముందుకు సాగేలా
నవ వసంతానికి నాంది పలుకుతూ.. రావమ్మా
కొత్త వత్సరమా ...

- జూలూరి నాగరాజుగౌడ్, కాశిబుగ్గ, వరంగల్

షడ్రుచుల సమ్మిళితం



వచ్చేసింది నవ వసంతం
తెలుగుదనం కూడిన
నిండుదనం
కష్ట సుఖాల కలబోత..
లాభ నష్టాల కలయిక
అన్నింటినీ సమానంగా సాగిస్తూ..
షడ్రుచుల సమ్మిళిత
ఉగాది పచ్చడిగా చేసుకొని ...
పచ్చడిలో ఒక్కొక్క రుచి
ఒక్కో దానికి ప్రతీకగా ....
జీవితంలోని మధురమైన జ్ఞాపకాలు
గుర్తుపెట్టుకొని...
సహనం కోల్పోకుండా అడుగు ముందుకేస్తూ
వెళ్లాలని ...
అందరికీ అంతా శుభమే జరగాలని ..

- బోనాసి రేణుక, మండేలగూడెం, జనగామ

ఉగాది వెలుగులు ఊరంతా పంచుదాం



కొత్త యుగానికి
ఆరంభం ఉగాది
ఆరు రుచుల
సమ్మేళనం ఉగాది
పదార్థాలు వేరైనా పచ్చడొక్కటే
కులాలు మతాలు వేరైనా మనుషులొక్కటే
కారంలో మమకారం, ఉప్పులో విశ్వాసం
చింత పులుపు, మామిడి వగరు, వేప చేదు
బెల్లంలో తీపి అనుబంధాల గుర్తులు.
కట్టుబాట్లు తొలగించుకొని
కల్మషాలను చంపుకొని
ఓర్వలేని తనాన్ని వదిలించుకొని
అందరం ఒకటనే అడుగులు వేస్తూ
ఉగాది వెలుగులు ఊరంతా పంచుదాం!

- తాండ్ర చిరంజీవి, ఖిలా వరంగల్

సంతోషాల సారథి ఉగాది



పక్షుల కిలకిలా రావాలతో చల్లనైన పిల్లగాలులు వీస్తుండగా..
కోకిల తన గానంతో కొత్త వత్సరానికి స్వాగతం పలుకగా..
చిందులేస్తూ వచ్చిన
చైత్ర మాసం..
వసంత కాలాన వరాలు ఇవ్వాలని
ప్రతి చిగురు అందరిలో చిరునవ్వును నింపాలని
విశ్వావసు అందరిలో విశ్వాసం నింపాలని
ఈ ఉగాది అందరిలో ఉత్సాహం నింపాలని
తీపి గుర్తులు జీవితాంతం గుర్తుండాలని
స్వాగతం పలుకుతూ..

- వంగపల్లి శంకర్, గొల్ల బుద్ధారం, జయశంకర్ భూపాలపల్లి

వసంతపు ఉగాది



అలసిన దేహాలకు..
కమ్మటి ఊసులు
ఆరబోసేందుకు
కొమ్మ చాటున దాగిన కోకిల
సప్త వర్ణాల సీతాకోక చిలుక
ఏ రంగుతో మేళవిస్తుందో..
ఈ వసంతపు జాడలు ఎక్కడివో..
ఎన్ని కొత్త సవాళ్లను అధిగమిస్తుందో..
నవరసభరితమైన జీవితానికి
షడ్రుచుల సమ్మేళనం
జీవిత తత్వాన్ని బోధించాలి..
పాత గాయాలను చెరిపేయాలి..
పంచాంగం కాగితంపై అక్షరాలు
ఊపిరిని నింపే జీవిత సారమవ్వాలి..!

- కొలిపాక శ్రీనివాస్, హనుమకొండ

వసంతపు రెపరెపలు



వేప పూత పలకరింత
కొత్త చింత పులకరింత
పచ్చి మిర్చి పొగరు సెగలు
మామిడి మధుర రుచులు
బెల్లం, కారం, ఉప్పు నోరూరేలా
షడ్రుచులు కలగలిసేలా
కావాలి జీవితం ఆనందమయం

- వెనిశెట్టి రవికుమార్, హనుమకొండ

జీవన వేద నాద ఉగాది



పురివిప్పిన మయూరిలా..
నటనాట్యమాడిన
ప్రకృతి హొయలు
చిటపట చినుకుల చిరుఝిడిలా
టపటప రాలే వేప పూతలు
విస్ఫారిన హృదయ కమలముగా వికసించిన
విరి వనములు
చిగురించిన చిగురాశల్లా సుందరమౌ పల్లవములు
పులకించిన మది గీతికలా కోయిలమ్మ
స్వర లహరులు
మంచి మనసుకు మారు రూపులా
తెల్లని చల్లని మల్లెలమ్మలు
నవకించిన మదీనవములా నవనవలాడే మావి
చిగురులు

- పద్మ త్రిపురారి, జనగామ

శుభకరం.. మంగళకరం



గ్రహాలకు అధిపతియైన
సూరీడు మహారాజైన వేళ
అష్టవసులు నింగి నుంచి నేలపైకి
ఏదెంచిన వేళ!
దుష్ట సంహరణ మొదలైన వేళ
ప్రతి ఇంటిలో శ్రేయస్సు సంపదలు పెరిగే వేళ!
సమాజ సంపత్తికి శుభకరం మంగళకరం
కానున్న వేళ!
ప్రపంచ శాంతి నెలకొంటుందన్న
నమ్మకం కుదిరిన వేళ
మన ఉగాదికి స్వాగతం సుస్వాగతం పలుకుతూ..

- చింతల కమల, హనుమకొండ

ఆమనీ.. వసంత యామినీ



ఆమనీ.. వసంత యామినీ
నవనవోన్మేష
నవ్య సౌందర్య భామినీ
మల్లెలు పూసే మధుమాసపు మృదుహాసిని
వెన్నెల కాచే ఎల్లర మోదపు హృది వాసిని
కోకిల స్వరజతుల కూచిత సుభాషిణి
వేపల పూతల చైత్రపు దరహాసిని
భూతల హరితవర్ణ శీతల సుకుమారిని
శ్రోతల మది దోచే వసంతరాగ మాలినీ
నూతన కాంతులు పంచే వసంత యామిని

- మణి నిడిగొండ, చింతకాని, జయశంకర్ భూపాలపల్లి

ఆత్మీయ స్వాగతమమ్మా



విశ్వావసు నామ వత్సరమా!
గతపు చేదు సంగతుల
సమస్తం చెరిపేసి
విశ్వజనుల మది మురియ శుభాలనిచ్చి
పాడి పంటలకు కొదువ లేక
దయతో వృద్ధి చేసి
ప్రకృతి కన్నెర్ర చేయక
తోడుండు వరములొసగి
సుపాలన చేయునట్లు పాలకుల్లో బుద్ధి తెచ్చి
రోగాల రొష్టులు రానీక
ప్రజలకు ఆరోగ్యమిచ్చే
ఉగాదికి ఆత్మీయ స్వాగతమమ్మా..

- కందుకూరి శ్రీనివాస్, జనగామ

పచ్చని వేడుక



నవీన, వరంగల్

పచ్చడితో కొత్త సంవత్సరం,
సందడి సంతోషం ముంచెత్తే
తరుణం!
ఆశలతో నిండాలి హృదయం,
మధురమైన జ్ఞాపకాలు మిగిలే సమయం!
సంవత్సర నూతన ఆశల పయనం,
సద్గుణాల కాంతిని పంచే వరం!
ఆనందం కలిగించే పండుగ వేళ,
ఆరోగ్య సంపదలు నిండాలి ఇంటింటా..

ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో జివాంజీ దీప్తికి పసిడి



బంగారు పతకం అందుకుంటున్న జివాంజీ దీప్తి

పర్వతగిరి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన జివాంజీ దీప్తి ఈనెల 20నుంచి 23వ తేదీ వరకు జరిగిన ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో ప్రతిభ కనబరిచారు. 400 మీటర్ల విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా దీప్తి మాట్లాడుతూ అందరి సహకారంతో ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో బంగారు పతకం సాధించానని పేర్కొన్నారు. ఒలింపిక్ గేమ్‌లో బంగారు పతకం సాధించడమే తన ధ్యేయమని ఆమె అన్నారు.

నేటి నుంచి వసంత నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం



హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయంలో ఆదివారం నుంచి వసంత నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ శేషుభారతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహిస్తామని తెలిపారు. అలాగే ఉగాదిని పురస్కరించుకుని సాయంత్రం 6 గంటలకు పంచాంగ శ్రవణం ఉంటుందని తెలిపారు

టీటీడీ కల్యాణ మండపంలో..

తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హనుమకొండ లష్కర్‌బజార్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు పంచాంగ శ్రవణం చేయనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీటీడీ డీపీపీ బాధ్యులు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు.